క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉ.8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పట్టణ ఏఈ వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని కాలనీలతో పాటు ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, నాగులపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కళాకారుడికి సన్మానం

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు వడ్ల రమేష్‌చారిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ వారు రవీంద్రభారతీలో గత మూడు రోజులుగా పద్యనాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళారంగానికి సేవలు అందిస్తున్నందుకు గాను కళాకారుడు వడ్ల రమేష్‌చారిని ఫౌండేషన్ చైర్మన్ గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఘనంగా సన్మానించి, రూ.10వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య, కళాకారులు రంగనాథం, సింగారం శ్రీనివాస్‌లు ఆయనను అభినందించారు.

సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

కొందుర్గు: రాష్ట్ర గురుకుల పాఠశాలల సంస్థ ఆధ్వర్యంలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ తీసుకొని ఉదయం 9–30లోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎన్‌టీఆర్ ట్రస్ట్ సీఈఓ, ఐపీఎస్ మాజీ అధికారి రాజేంద్రకుమార్



రక్తదానం చేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎన్‌టీఆర్ ట్రస్ట్ సీఈఓ, ఐపీఎస్ మాజీ అధికారి రాజేంద్రకుమార్, మాజీ ఎంపీ బత్తని నర్సింహులుగౌడ్‌లు అన్నారు. మండలంలోని గండిపేట సమీపంలోని హిమాయత్‌నగర్ ఎన్‌టీఆర్ కుటీరంలోని పాఠశాలలో గురువారం మాజీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రకుమార్, నర్సింహులుగౌడ్, కళాశాల డీ న్ రామారావులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, నియోజకవర్గంలోని నాయకులు దాదాపు 100 మంది రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులు ఆస్పత్రుల్లో కావాల్సిన రక్తం అందక ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. అలాంటి వారి కోసం రక్తదాన శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రామారావు, ప్రిన్సిపాల్ ఎస్.జే.రెడ్డి, సిబ్బంది మట్టయ్య, సురేష్, అధ్యాపకులు, నాయకులు సుభాష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు

- నందిగామలో ఇఫ్తార్ విందు
- హాజరైన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: మండల కేంద్రం నందిగామలో ప్రభుత్వం తరఫున గురువారం రాత్రి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఇఫ్తార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ఉపవాస దీక్షలు పాటించడం గొప్ప విషయమన్నారు. పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, నాయకులు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, తహసీల్దార్ రాములు, ఆర్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ , కోఆప్షన్ సభ్యుడు బేగ్, పెంటయ్య గౌడ్ పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వని అధికారులు..

ప్రభుత్వం తరఫున ఇచ్చిన ఇఫ్తార్ విందు అధికారికంగా నిర్వహించారా.. లేక ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించారా అనే విషయమై మండలంలో చర్చనీయాంశంగా మారింది. నందిగామలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని పలు గ్రామాలకు చెందిన ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ రాములును వివరణ కోరగా నందిగామలో ఇచ్చిన ఇఫ్తార్ విందు అధికారికంగా ఇచ్చిందేనని, సమాచారం ఇవ్వడం తమ బాధ్యత కాదన్నారు. ఫరూఖ్‌నగర్ తహసీల్దార్, మసీదు నిర్వాహకులు సమాచారం ఇచ్చుకోవాలని చెప్పడం గమనార్హం.

ప్రైవేట్‌కు దీటుగా విద్యా ప్రమాణాలు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

షాబాద్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్‌లో పాఠశాల సుందరీకరణ, అభివృద్ధి పనులను, పాఠశాల ప్రహరీగోడ పనులను వైస్ ఎంపీపీ జడలలక్ష్మి, రాజేందర్‌గౌడ్, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ అనురాధ, హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. కాంపౌండ్‌వాల్‌కు మ్యూరల్ ఆర్ట్ ద్వారా రంగు రంగుల బొమ్మలను చిత్రీకరించారు. స్కూలు పిల్లలను ఆకర్షించే విధంగా, వివిధ రకాల చిత్రాలను గోడలపై వేయించామన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందన్నారు. తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థుల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ పాఠశాలకు వచ్చినప్పుడు 5 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శిలు సుదర్శన్, కృష్ణ, దాతలు గోపాల్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, సుభాష్ రెడ్డి, కృష్ణారెడ్డి, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, బందయ్య, మల్లేష్, శంకర్, యాదగిరి, రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నాగిరెడ్డి, అంజయ్య, సింహాద్రి నాయుడు, బందయ్య, లక్ష్మణ్ తదితరులున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ధ్యాన ప్రచార కార్యదర్శి అంజనేయరెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి, శ్రీనివాస్

షాబాద్: ప్రతినిత్యం ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంతారం, మరియాపూరం, ఎల్గొండగూడ, కేసారం, కుర్వగూడ గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. గుండె జబ్బులు, బీపీ, షుగర్ లాంటి వ్యాధులు దరిచేరవని అన్నారు. తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు ఎలాంటి జబ్బులైనా ధ్యానం ద్వారా తగ్గుతాయని చెప్పారు. ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, శైలజ, సుభద్ర, యాదయ్య, కృష్ణమద్దిలేటి, రాంచంద్రయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

మతవిద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న శంకర్

షాద్‌నగర్: కుల, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం ఫరూఖ్‌నగర్, పటేల్‌రోడ్డు, చటాన్‌పల్లి, రాంనగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు నాలుగు వేల మందికి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... వర్గ విభేదాలను సృష్టించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. హిందూ, ముస్లింలు, క్రైస్తవులు కలిసిమెలిసి సంస్కృతి సంప్రదాయాలను రక్షిస్తూ దేశాన్ని సుభిక్షంగా ఉంచాలని, అందరు స్వేచ్ఛగా జీవించాలని కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ధానధర్మాలు, సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అందెమోహన్, ముబారక్, అనంతం, మసూద్‌ఖాన్, ఖదీర్, మాధవులు, రవి, అశోక్, శ్రీధర్, శర్ఫోద్దీన్, శ్రీనునాయక్, నర్సింలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సీఐటీయూ



వీఓఏలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: గ్రామస్థాయిలో అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మండలంలోని మహిళా సమాఖ్య భవనం ఎదుట గురువారం రెండవ రోజు వీఓఏలు సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయిన స్పందించలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సునీత, జ్యోతి, వీఓఏలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి మారు పేరు తెలంగాణ

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: మత సామరస్యానికి మారు పేరు తెలంగాణ అని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సూపర్ డీలక్స్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తున్నారని, వారు పండుగలను ఘనంగా జరుపుకొనేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రాజు పాల్గొన్నారు.

ఆహార అలవాట్ల మార్పుతోనే గుండెపోట్లు

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల



సీపీఆర్ చేస్తున్న తాంద్ర విశాల

కేశంపేట: ఒత్తిడితో కూడిన జీవన విధానం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాంద్ర విశాల అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సీపీఆర్‌పై పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్, మండల పరిషత్, విద్యాశాఖ సిబ్బందికి అవగాహన వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ.. హృదయ శ్వాసకోస పునర్జీవన చర్య (సీపీఆర్) ద్వారా మనుషులను కాపాడుకోవచ్చని అన్నారు. అవగాహన లేక గుండెజబ్బులతో చాలా మంది మరణిస్తున్నారని తెలిపారు. సీపీఆర్ ట్రైనింగ్ పొందిన ప్రతి ఒక్కరూ మరో ముగ్గురికి ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మండల వైద్యాధికారి నిఖిత, ఎంపీహెచ్‌ఈఓ ఆంజనేయులు, సుందరి, పుష్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

షాద్‌నగర్: మండలంలోని మధురాపూర్‌లో కాంగ్రెస్ నేత, కళాకారుడు నంద్యాల పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి మహత్యం నాటకాన్ని బుధవారం రాత్రి ప్రదర్శించారు. గ్రామంలోని యువతకు గత మూడు నెలలుగా నాటకాన్ని నేర్పించి గ్రామంలో ప్రదర్శించారు. వీరి నాటక ప్రదర్శన అందరిని ఎంతో ఆకట్టుకుంది. గ్రామస్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా నాటకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ... కనుమరుగవుతున్న స్టేజి నాటక కళలను భావితరాలకు అందించాలని, నాటకాల ప్రదర్శనల గొప్పతనాన్ని నేటి సమాజానికి తెలియజేయాలనే లక్ష్యంతో యువతకు నాటకాలను నేర్పించి ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రంగయ్యగౌడ్, గుండ్రాతి బాల్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



చేతులు పైకి లేపి ఓటు హక్కును వినియోగించుకుంటున్న వార్డు సభ్యులు, హాజరైన అధికారులు

- 9 మందికి గాను, 7గురు అనుకూలంగా వేసిన ఓట్లు

కేశంపేట: ఉప సర్పంచ్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో, మండలంలోని నిర్దవెల్లి ఉపసర్పంచ్ మల్లయ్య తన పదవిని కోల్పోయారు. షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి గురువారం అవిశ్వాస తీర్మానంపై గ్రామ పంచాయతీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీలో పది వార్డులు ఉండగా ఐదవ వార్డు సభ్యురాలు ఎన్నికల ఖర్చులను చూపకపోవడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ గతంలో అనర్హత వేటు వేసింది. మిగతా 9 మంది వార్డు సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో ఉప సర్పంచ్ మల్లయ్య వార్డు సభ్యురాలు మంజుల అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా చేతిని పైకి లేపి ఓటు వేశారు. మిగతా వార్డు సభ్యులు ఖాజాపాష, ఫైజల్‌ఖాన్, లలిత, నిరంజన్, రాములు, పద్మమ్మ, నీలమ్మలు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులను పైకి లేపి ఓటు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, తహసీల్దార్ అజీం అలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ ఆనంద్‌రావు, ఆర్‌ఐ నిహారిక, ఎంపీఓ నర్సింలు, పంచాయతీ కార్యదర్శులు బద్రప్ప, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

హెరిటేజ్ డెయిరీ మధురాపూర్ ప్లాంట్ మేనేజర్ సందీప్‌రెడ్డి



రుణాలు అందజేస్తున్న సందీప్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని హెరిటేజ్ డైరీ మధురాపూర్ ప్లాంట్ మేనేజర్ సందీప్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గులలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో 10 మంది పాడి రైతులకు లక్ష చొప్పున (10లక్షలు) రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలతో మేలు జాతి పశువులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. మేలు జాతి పశువులతో పాల దిగుబడి అధికంగా వస్తుందని, దీంతో రైతు ఆదాయం పెరుగుతుందని చెప్పారు. పశువులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ (బీమా) చేసుకోవాలని సూచించారు. హెరిటేజ్ ద్వారా సబ్సిడీపై దాణా, క్యాల్షియం, మినరల్ మిక్షర్, నట్టల నివారణ మందులకు అందిస్తామని , ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హెరిటేజ్‌లో పాలు పోసే ప్రతి పాడి రైతులకు రూ 2లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి అనారోగ్యానికి గురైనా పశు వైద్యులను సంప్రందించాలని సూచించారు. కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ సూపర్‌వైజర్ రాజమహేందర్‌రెడ్డి, పాల సేకరణ ప్రతినిధి చెన్నయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన కాంగ్రెస్ బలోపేతం



నూతన కమిటీతో నియోజకవర్గం నాయకులు

చేవెళ్ల: గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవుని ఎర్రవల్లిలో గురువారం వారు గ్రామ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించి నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డిలతో కలిసి గ్రామ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి గ్రామా ల్లో ఉన్న ఆదరణను ఉపయోగించుకొని పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజల్లో ఒక నమ్మకం ఉంటుందని చెప్పారు. చేవెళ్ల గడ్డపై మళ్లీ కాంగ్రెస్ జెండాను ఎగురవేసే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవునిఎర్రవల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బస్తేపురం నర్సింలు, ఉపాధ్యక్షుడిగా శంకరయ్య, కార్యదర్శిగా ఎండీ జావేద్, కోశాధికారిగా మాణిక్యం, సభ్యులుగా హరీష్, వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటయ్య, చంద్రయ్యలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు బక్కయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, వార్డు సభ్యులు మల్లేశం, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

ఏపీఎం భగవంతు

కేశంపేట: మహిళ సంఘాల సభ్యుల వివరాలను లోకోయాప్‌లో నమోదు చేయాలని ఏపీఎం భగవంతు అన్నారు. మండలంలోని మండల మహిళ సమాఖ్య భవనంలో గ్రామ బుక్ కీపర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా భగవంతు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లోకోయాప్‌లో సంఘం సభ్యుల వివరాలతో పాటు ఫొటోలను అప్‌లోడ్ చేయాలని అన్నారు. అలాగే, సంఘం యొక్క ఆర్థిక వివరాలతో పాటు జమపద్దులను నమోదు చేయాలని చెప్పారు. గ్రామాల్లో ఉన్న ప్రతి సంఘం సభ్యుల వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆడిటర్ యాదగిరి, సీసీలు పాల్గొన్నారు.